ప్రజాశక్తి
శుక్రవారం 4 ఆగస్టు 2023 5 శ్రీకాకుళం

రేపు డయల్ యువర్ యూనివర్శిటీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో అకడమిక్ సమస్యలు, వాటి పరిష్కారాలపై విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలన్న లక్ష్యంతో ఈనెల 5వ తేదీన డయల్ యువర్ యూనివర్శిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ సిహెచ్.ఎ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ సంబంధిత అంశాలపై సందేహాలు నివృత్తి కోసం 82478 61919 మొబైల్ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరద వస్తే భయమే

- గతేడాది గొట్టాబ్యారేజీ దిగువన కోతకు గురైన గట్టు
- హిరమండలంలో రెండేళ్ల కిందట వంశధారకు గండి
- తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్న ప్రభుత్వం
- శాశ్వత ప్రాతిపదికన పనులకు నిధులు కేటాయించని వైనం

హిరమండలంలో బ్యారేజీకి దిగువన కోతకు గురైన వరద గట్టు (ఫైల్)

వంశధారకు వరద వస్తే అధికారుల్లో గుబులు రేగుతుంది. హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద గతేడాది ఆగస్టులో వరదలు వచ్చిన సందర్భంగా బ్యారేజీ దిగువన వరద గట్టు కోతకు గురైంది. అంతకుముందు ఏడాది గొట్టాబ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఎలుకల మెట్ట వద్ద కొంతమేర గట్టు కొట్టుకుపోయింది. శాశ్వత ప్రాతిపదికన పనులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల చేయకపోవడంతో, అధికారులు తాత్కాలికంగా కొంతమేర పనులు చేపట్టారు. వంశధారకు 80 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే మళ్లీ ఈ సమస్యలు పునరావృతమవుతాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు. కాలువకు గండ్లు పడితే తమ పొలాలు ముంపునకు గురవుతాయంటూ మరోవైపు రైతులు కలవరపడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధారకు 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిన సందర్భంతో గతేడాది ఆగస్టులో హిరమండలం బ్యారేజీ దిగువ భాగాన కొంతమేర వరద గట్టు కోతకు గురైంది. గట్టుకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంశధార కాలువ గట్లు ఎంత బలహీనమో 2021 జూలై 15న హిరమండలం వద్ద ఎడమ కాలువ కోతకు గురవ్వడం పరిశీలిస్తే తేటతెల్లమవుతుంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మట్టి నానిపోవడంతో గొట్టాబ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకల మెట్ట సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

బ్యారేజీ వద్ద దెబ్బతిన్న అప్రాన్

హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద 0.612 టిఎంసిల సామర్థ్యంతో 1977లో బ్యారేజీ నిర్మించారు. బ్యారేజీ ఎగువ భాగంలో ఎడమవైపున 3.6 కిలోమీటర్లు, కుడివైపు 6.2 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించారు. బ్యారేజీకి ఆనుకుని దిగువ, ఎగువ భాగంలో 11.06 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ బ్లాక్‌లతో దృఢమైన అప్రాన్‌ను నిర్మించారు. అప్రాన్‌కు సపోర్టుగా పెద్ద పెద్ద బండరాళ్లను కట్టగా పేర్చారు. 2008, 2010 ఆగస్టులో వచ్చిన వరదలతో అప్రాన్ క్రమేణా దెబ్బతింటోంది. బ్యారేజీ దిగువ భాగంలో తాత్కాలికంగా మూడు మీటర్ల మేర రాళ్లను వేశారు. బ్యారేజీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 2012, మార్చి 26న రూ.3.48 కోట్లతో 2014 మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు మరోసారి బండరాళ్లు కొట్టుకుపోయాయి. 2015లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీరు సర్వే చేసి అదే ఏడాది మేలో తనిఖీ నివేదిక సమర్పించింది. బ్యారేజీ దిగువ భాగంలో అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం రూ.9.72 కోట్లు కేటాయిస్తూ 2017 ఫిబ్రవరి ఏడో తేదీన ఉత్తర్వులను వెలువరించింది. అప్పట్నుంచి పనులు చేపట్టకుండా పాలకులు నాన్చుతూ వచ్చారు.

సాగునీటిపై ప్రభావం

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ప్రతిఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. తోటపల్లి పాత రెగ్యులేటరీ వ్యవస్థ ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో వీరఘట్టం, పాలకొండ పరిధిలోని 27,410 ఎకరాలకు సాగు నీరందించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 414 క్యూసెక్కులు కాగా, అందులో మూడో వంతు నీటిని కూడా విడిచిపెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మూలపేటలో ఉద్రిక్తత

- ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు
- రైతులతో కలిసి వేసిన వరినాట్లు
- రెండో రోజూ కొనసాగిన పంటల ధ్వంసం
- అడ్డుకునేందుకు వెళ్లిన సిపిఎం నాయకుల అరెస్టు, విడుదల

తహశీల్దార్‌ను నిలదీస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

గోవిందరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - నౌపడ

మూలపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదానీ పోర్టు కోసం బుల్డోజర్‌తో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించి, నాట్లు వేసిన సిపిఎం నాయకులు మూలపేటలో పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సమయంలోనే రెండో రోజూ అధికారులు పంటలను ధ్వంసం చేశారు. దీంతో అక్కడకు వెళ్తున్న సిపిఎం నాయకులను పోలీసులు అడ్డగించడం, బలవంతంగా అరెస్టులు చేయడం... అధికారులను నాయకులు, రైతులు నిలదీయడం... పంట ధ్వంసాన్ని తట్టుకోలేక మహిళ సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

రెవెన్యూ అధికారులు ధ్వంసం చేసిన పంట పొలాలను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి హెచ్.ఈశ్వరరావు పరిశీలించారు. మూలపేటలో పర్యటించి బాధిత రైతులు, మహిళలతో మాట్లాడారు. ఇప్పటివరకు భూసేకరణను వ్యతిరేకిస్తూ 43 మంది రైతులు 48 ఎకరాలు ప్రభుత్వానికి ఇవ్వలేదని రైతులు చెప్పారు. వీరిలో కొంతమంది పంట వేసుకోగా, అధికారులు దౌర్జన్యంగా బుల్డోజర్లతో పంటను తొక్కించేశారని సిపిఎం నాయకుల వద్ద పలువురు మహిళలు వాపోయారు. నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేస్తారని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి బుల్డోజర్ సంస్కృతిని అదానీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని విమర్శించారు. అధికారులైనా, ఎవరైనా రాజ్యాంగ పరిధిలో నడుచుకోవాలి తప్ప దానికి భిన్నంగా వ్యవహరించకూడదని గుర్తుచేశారు. రైతులు వారి సొంత భూముల్లో వరి పంటను వేసుకుంటే తొక్కించడం రాజ్యాంగ, చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికైనా బలవంతపు భూసేకరణను ఆపాలని, రైతులపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. భూములు ఇవ్వని రైతులపై దౌర్జన్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం బుల్డోజర్‌తో నాశనం చేసిన మూడు ఎకరాల పంట పొలాన్ని గ్రామస్తులతో కలిసి వెళ్లి వరినాట్లు వేశారు.

రెండో రోజూ కొనసాగిన దౌర్జన్యకాండ

మూలపేటలో ఒకవైపు సిపిఎం నాయకులు బాధిత రైతులతో మాట్లాడుతుండగా, మరోవైపు టెక్కలి సిఐ చంద్రమౌళి నేతృత్వాన పోలీసు బందోబస్తు మధ్య తహశీల్దార్ చలమయ్య, రెవెన్యూ అధికారులు రెండో రోజూ బుల్డోజర్‌తో పంట పొలాలను ధ్వంసం చేశారు. దీంతో మాజీ సర్పంచ్ జీరు భీమారావు, జీరు సుందరరావు, గ్రామస్తులు తహశీల్దార్‌ను నిలదీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకే చేస్తున్నామని చెప్పారు. తన పొలంలో పంటను బుల్డోజర్లతో తొక్కించడాన్ని తట్టుకోలేక కోట అమ్మన్నమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను టెక్కలి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. పంటల ధ్వంసం విషయాన్ని తెలుసుకున్న సిపిఎం నాయకులు అడ్డుకునేందుకు బయలుదేరగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టు నిర్మిస్తే తొలుత పునరావాసం కల్పించాలని, పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని ఏదీ లేకుండా పచ్చని పంట పొలాలను ఎందుకు నాశనం చేస్తున్నారని తహశీల్దార్‌ను సిపిఎం నాయకులు నిలదీశారు. ధ్వంసాన్ని అడ్డుకునేందుకు పోలీసులను ప్రతిఘటించి వెళ్తుండగా పోలీసులు బలవంతంగా వారిని అరెస్టు చేసి నౌపడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు.

సిఎం ఆదేశిస్తే ఎంపీగా పోటీ

- రోజుకో అబద్ధంతో విపక్షాల కుయుక్తులు
- క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎక్కడ నుంచి పోటీ చేయమని ఆదేశిస్తే, అక్కడ్నుంచే చేస్తానని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎంపీగా పోటీ చేయాలని ఆదేశిస్తే ఎంపీగానే చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విపక్షాలు రోజుకో అబద్ధంతో ప్రజలను వంచిస్తున్నాయన్నారు. స్వార్థమే పరమావధిగా పవన్, చంద్రబాబు కుయుక్తులు చేస్తున్నారని విమర్శించారు. 14 ఏళ్ల అధికారంలో ఉండి అవకాశమున్నా ఏమీ చేయని టిడిపి, ప్రజా ధనం ప్రభుత్వం వృథా చేస్తోందని నాలుగేళ్లుగా గగ్గోలు పెట్టిందన్నారు. ఇప్పుడు తామూ ఆ పథకాలు కొనసాగిస్తామని చెప్తోందన్నారు. ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యంతో సిఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలన్న ఆలోచనతో ప్రారంభమైందే జగనన్న సురక్ష కార్యక్రమం అని చెప్పారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సీనియర్ ఐఎఎస్ అధికారుల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు అంతా కలిసి పనిచేశారన్నారు. జగనన్న సురక్ష అనుకున్న లక్ష్యాన్ని సకాలంలో నెరవేర్చిందని తెలిపారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 1.46 కోట్ల కుటుంబాలను వాలంటీర్లు సర్వే చేసి ప్రజలకు ఏ సేవలు కావాలో అడిగి మరీ నమోదు చేసుకున్నారని వివరించారు.

పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత పదవులు ఆశించిన కొందరు నేతలు, పదవులు పొందిన వారు సైతం పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంతటి వారైనా సరే వారిపై వేటు తప్పదన్నారు. పద్ధతి మార్చుకునేందుకు చివరి అవకాశం ఇస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, కోరాడ చంద్రభూషణ్ గుప్త, చీపురు కృష్ణమూర్తి, నక్క తులసీదాస్, తంగి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యలేశంలో నాగచైతన్య సందడి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో సినీ నటుడు నాగచైతన్య గురువారం సందడి చేశారు. డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసుతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. మత్స్యకారుల జీవన స్థితిగతులు ఇతివృత్తంగా ఆయన నటించనున్న సినిమాకు సంబంధించి మత్స్యకారులతో మాట్లాడారు. సినిమాలో కనిపించే హీరో తీర ప్రాంతానికి రావడంతో స్థానికుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాగచైతన్యను చూసేందుకు, ఫొటోలు తీసుకునేందుకు ఆరాటపడ్డారు. అనంతరం నాగచైతన్య విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల కిందట దర్శకుడు చందు మొండేటి మత్స్యకారుల జీవన విధానంపై తనకు కథను వినిపించారని, ఆ కథ తన మనసును తాకడంతో వెంటనే ఓకే చెప్పానన్నారు. మత్స్యకారుల జీవన విధానం తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. యధార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కించనున్నట్లు తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించిన మత్స్యకారులను అక్కడి కోస్ట్‌గార్డు సిబ్బంది అరెస్టు చేశారని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. దర్శకుడు చందు మొండేటి, నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు పాకిస్థాన్ కోస్ట్‌గార్డు సిబ్బందికి ఎలా చిక్కారు, అక్కడి జైళ్లలో పడిన ఇబ్బందులు, పాక్ ప్రభుత్వం వీరిని ఏవిధంగా విడుదల చేసిందీ అన్న అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. చిత్రం ప్రారంభానికి ముందే మత్స్యలేశం గ్రామాన్ని సందర్శిద్దామని, అంశాలన్నీ అధ్యయనం చేశాకే షూటింగ్‌ను ప్రారంభిద్దామని నాగచైతన్య చెప్పడంతో ఇక్కడికి వచ్చామని పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన డి.మత్స్యలేశానికి చెందిన రామారావు నుంచి పూర్తి వివరాలను అధ్యయనం చేశారు.

పంచాయతీల నిధుల గల్లంతు

కేంద్ర ఆర్థిక మంత్రికి ఎంపీ ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ గ్రామ పంచాయతీల హక్కులను కాలరాస్తోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం దారిమళ్లించి గ్రామాల్లో కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితి కల్పించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్స్ ప్రతినిధులతో కలిసి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో రోజువారీ పౌర నిర్వహణ పనులనూ సర్పంచ్‌లు చేయలేకపోతున్నారని చెప్పారు. నిధుల కొరత వల్ల తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి ఆటంకం కలుగుతోందని వివరించారు. కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థికసంఘం నిధులను గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ అయిన తర్వాత గంటల వ్యవధిలోనే కొల్లగొట్టారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు సమాంతరంగా ఏర్పాటు చేసిన సచివాలయ, వాలంటరీ వ్యవస్థ వల్ల పంచాయతీరాజ్ వ్యవస్థ పతనమైందని వివరించారు.



నిర్మలా సీతారామన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీ తదితరులు

పిజి పరీక్షలు పరిశీలన

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పలు పిజి కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలను వర్సిటీ వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు గురువారం పరిశీలించారు. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల విభాగాల్లో నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు అస్కారం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

ఓటింగ్ యంత్రాల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటింగ్ యంత్రాలు కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. వాటిని ఇవిఎంలు భద్రతపరిచే గదిలో కట్టుదిట్టమైన భద్రత నడుమ భద్రపరిచారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈ గోదాములో ఈ యంత్రాల పనితీరును జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. ఇవిఎంలతో పాటు వివిప్యాట్‌ల్లో సాంకేతికపరమైన లోపాలను సరిచేశారు. పరిశీలనలో కలెక్టరేట్ ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్‌తో పాటు డిప్యూటీ తహశీల్దార్లు ఉన్నారు.

పరిశీలిస్తున్న డిఆర్ఒ మురళీకృష్ణ

నేడు ఆర్థికమంత్రి 'బుగ్గన' రాక

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించనున్నారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే

ప్రజాశక్తి - కొత్తూరు, మెళియాపుట్టి

ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లాపరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్ అన్నారు. కొత్తూరు, మెళియాపుట్టి తహశీల్దార్ కార్యాలయాల్లో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో తొలగింపు, జత చేయడానికి సంబంధించి ప్రతి దరఖాస్తుకు డాక్యుమెంటేషన్ పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సంతకాల్లేకుండా ఫారాలను అప్‌లోడ్ చేయొద్దని సూచించారు. వాలంటీర్లతో సర్వే చేస్తున్నారని మెళియాపుట్టి మండలం దీనబంధుపురం బిఎల్ఎ కర్రన్న ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని జెడ్‌పి సిఇఒ ఆదేశించారు. ఓటర్ల సర్వేలో వాలంటీర్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. సర్వేకు వాలంటీర్లను వెంట తీసుకెళ్తే సంబంధిత బిఎల్‌ఒలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఓటర్ల సర్వే చేసేటప్పుడు బిఎల్‌ఒలు బిఎల్ఎలకు సమాచారం అందించడం లేదని కలెక్టర్ దృష్టికి వచ్చిందన్నారు. ఒడిశా వ్యక్తులకు ఇక్కడ ఓటరు కార్డు నమోదై ఉంటే క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలన్నారు. పట్టుపురం బిఎల్ఒ పనిలో వెనుకబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మారేడుకోట బిఎల్ఒ భుజంగరావు సమావేశానికి గైర్హాజరు కావడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. కొత్తూరు మండలంలో ఇప్పటివరకు 6,553 ఓటర్ల సర్వే జరిగిందన్నారు. కేవలం 32శాతమే అయిందని, వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ పి.సరోజని, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ, శైలజ, ఎన్నికల డిటి ఎ.శైలజ, ఊణ్ణ శంకరరావు, ఇఒపిఆర్‌డి ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్

10 నుంచి నిరవధిక సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల పదో తేదీ నుంచి నిరవధిక సమ్మె తప్పదని విద్యుత్ ఉద్యోగ సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ ఎం.వి గోపాలరావు, పలాస డివిజన్ అధ్యక్షులు గార రాజారావు హెచ్చరించారు. దశల వారీ ఉద్యమంలో భాగంగా నగరంలోని సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే విడుదల చేయాలని, విద్యుత్ సర్వీసుల్లో జాప్యానికి లైన్‌మెన్లను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేస్తూ వేతనాల్లో కోతలు విధించడం తగదన్నారు. తక్షణమే ఉద్యోగులకు పిఆర్‌సిని ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, రీడింగ్ ఆపరేటర్లు, ఇతర కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ఇస్తున్న మస్టరల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు నగదు రహిత వైద్యసౌకర్యాన్ని అందించాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చకుంటే విజయవాడలో విద్యుత్ సౌధ ముట్టడి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పట్నాయక్, జి.సురేష్ కుమార్, సిహెచ్.వెంకటేశ్వరరావు, రాకోటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
A.R.B.O.P: 1/2019

Between:-
Behara Hari Hara **--Petitioner**
And:-
Shriram City Union Finance Co., Ltd., and others **--Respondents**

To,

NOTICE

R-3). Nikkondi Rana Pratap, S/o Narayana Murty, Hindu, aged 44 years, Residing at D.No:2-10, Raja Street, Mandadsa Village and Mandalam, Srikakulam Ditrict.

Please take notice that the above matter is posted to **dt:10-08-2023** for your appearance. You are hereby directed to appear before the above Hon'ble Court on **dt:10-08-2023 at 10-30 A.M.,** either in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence. Hence this notice.

//BY ORDER//

T. KHAGENDRA NATH,
ADVOCATE FOR THE PETITIONER
SRIKAKULAM.
CELL: 9440105533.

టిడిపి హయాంలోనే భూ కబ్జాలు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆర్భాటకో, సంతకర్తలానికి టెక్కలి వస్తారని, అసలు ఆయన ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. భావనపాడు పోర్టు మూలపేట పోర్టుగా పేరు మార్చిన విషయం కూడా అచ్చెన్నాయుడుకు తెలియని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. మూలపేట పేరు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. టెక్కలిలో భూ దందాలు టిడిపి హయాంలోనే జరిగాయని విమర్శించారు. జగద్గాత్రి స్వర్ణకారుల సంఘం భూమిని 22-ఎ లో ఉండేదని, అది ఎంతకు, ఎవరు తొలగించారని పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. నియోజవర్గంలో సచివాలయాలు, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు పనులతో పాఠశాల అభివృద్ధికి అచ్చెన్నకు కనిపించవా ప్రశ్నించారు ఎప్పటికైనా అర్ధరహితమైన మాటలు మానేసి పూర్తి సమాచారంతో మాట్లాడాలన్నారు. ఈయనతో పాటు సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాలవసంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కోత సతీష్ ఉన్నారు.

సాంకేతిక లోపాలను సరిచేయాలి

ప్రజాశక్తి - నరసన్నపేట

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు నమోదు సర్వేలో సాంకేతిక పరమైన లోపాలు లేకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి డి.జయదేవి అధ్యక్షతన నియోజకవర్గ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేలో జరుగుతున్న సాంకేతిక లోపాలు, తీరును రిటర్నింగ్ అధికారికి తెలియజేశారు. జయదేవి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషితోనే ఓటరు నమోదు సర్వే వేగవంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.సింహాచలం, డిటి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశుసంవర్థకశాఖ జెడి కిషోర్

వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముద్ద చర్మపు వ్యాధి ప్రబలకుండా రైతులందరూ తమ వద్ద ఉన్న 4 నెలల వయసు దాటిన తెల్ల పశువులన్నింటికీ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్ సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం లంకాం పంచాయతీ పరిధి మెండపేటలో చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది అనేక పశువులు ముద్ద చర్మపు వ్యాధి బారిన పడి, పాల దిగుబడి తగ్గి, రైతులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. అందువల్ల ఈ ఏడాది ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 1 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యమ్రాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాథం, రాగోలు పశు వైద్యాధికారి డాక్టర్ బి.యోగేశ్వరరావు, గార సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి.రాజశేఖర్, సర్పంచ్ చిట్టి రవికుమార్, రుప్ప చిట్టిబాబు, మెండ దాలయ్య, సురేష్, శంకరనారాయణ, జనార్ధన పాల్గొన్నారు.

ఆర్ఎంపి వైద్యులపై డిప్యూటీ డిఎంహెచ్ఒ ఆగ్రహం

ప్రజాశక్తి - జలుమూరు

మండలంలోని సైరిగాంలో గత నెల రోజులుగా విషజ్వరాలు గ్రామస్తులను పట్టిపీడిస్తున్నాయి. సుమారు 500 మందికిపైగా విష జ్వరాల బారిన పడ్డారు. అయితే వీరంతా స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లేనా జ్వరం తగ్గలేదనే కారణంతో ఆర్ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. బుధవారం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఒ లక్ష్మీతులసి అధ్యక్షతన గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులు ఇప్పటికే ఆర్ఎంపిలను రాసిన మందులు వాడుతున్నామని డిప్యూటీ డిఎంహెచ్ఒకు చూపించారు. ఆ మందులను చూసిన ఆమె విస్మయానికి లోనయ్యారు. ఆమె సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. గ్రామంలో వందల మంది జ్వరాల బారిన పడ్డారని, వీరంతా గ్రామంలోని ప్రభుత్వాస్పత్రిని ఉన్నా ఆర్ఎంపిలను ఆశ్రయించడం వెనక స్థానిక వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్వర బాధితులకు ప్రయివేటు ల్యాబ్ వద్ద పరీక్షలు నిర్వహించి వారికి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ అంటూ ప్రాణాంతకమైన డెక్సాన్ వంటి స్టెరాయిడ్స్ ఎక్కించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రోగులకు ఇవి వెంటనే జ్వరం తగ్గించేలా చేసినా... భవిష్యత్‌లో రోగి శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపిస్తాయని అన్నారు. డెంగీ జ్వరం నిర్ధారణకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలోనే పరీక్షలు నిర్వహించాలి తప్ప... ప్రయివేటు ల్యాబ్‌ల్లో చేపట్టరాదని సూచించారు. ఈ నిబంధనలు పాటించని ఆర్ఎంపిలతో కొంతమంది రోగి నుంచి రూ.10వేల వరకు మందులు కొనుగోలు చేయించడంపై విస్మయం చెందారు. ఆర్ఎంపిలు నిర్వహించే క్లినిక్లను తనిఖీ చేసే అధికారం వైద్యాధికారులకు ఉన్నా ఎందుకు తనిఖీ చేయలేదని, తరచూ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కొంతమంది ఆర్ఎంపిలతో ఆమె ఫోన్లో మాట్లాడి వారికి ఉన్న అర్హత చూపించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలోని తాగునీటి వినియోగించే బావులు, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు బందాలుగా ఏర్పడి గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, సైరిగాం, జలుమూరు, అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పి.గురునాథరావు, తాడేల శ్రీకాంత్, కొయ్యాన అప్పారావు, డివిజనల్ అధికారి వై.కె.శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు, అల్లాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్ పొన్నాన ముసలి నాయుడు, వైసిపి నాయకులు ధర్మాన రమణమూర్తి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న లక్ష్మీతులసి

ఆప్తమిత్రునికి అశ్రు నివాళి

ప్రజాశక్తి - కవిటి

పాడె మోస్తున్న ఎమ్మెల్యే అశోక్

పార్టీ కార్యకర్తలు, నాయకులతో టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఉన్న అనుబంధం మరోమారు రుజువైంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ కార్యకర్త కొరికాన కుర్మారావు (68) గురువారం తుది శ్వాస విడిచారు. అయితే గురువారం ఉదయం నుంచే కూర్మారావు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ కూర్మారావు నివాసానికి చేరుకుని అతని కుటుంబ సభ్యులు, బంధువులకు ధైర్యాన్ని చెప్పారు. అనంతరం కుర్మారావు పాడెమోసి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కూర్మారావుకు తన తండ్రి నుంచి తన వరకూ ఉన్న అనుబంధాన్ని, ఒక కార్యకర్తగా టిడిపికి అతను చేసిన సేవలను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

భోజనం వడ్డిస్తున్న లక్ష్మీరాజ్యం

నిరాశ్రయుల ఆకలి తీర్చడమే లక్ష్యం

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిరాశ్రయుల ఆకలి తీర్చడమే అన్న క్యాంటిన్ల లక్ష్యమని, ఆ లక్ష్యంతోనే టిడిపి ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన అన్న క్యాంటిన్లను ప్రస్తుత ప్రభుత్వం మూసివేసిందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరాయంగా గడచిన 106 రోజులుగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటిన్ల వద్ద గురువారం పాల్గొని భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు టిడిపి ఎప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు నాయకత్వాన మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, పేదల వైసిపి పాలనలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, రాయి కిరణ్, కమలనాథ్, మెండ బాలు, ఎస్.వి.రమణ, నరసింహ, శాంత, ఆనంద్ పాల్గొన్నారు.

కాజీపేటలో కెజిబివి విద్యార్థులు!

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని కొల్లివలస గాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినులు బుధవారం అదృశ్యమైన విషయం విదితమే. దీనిపై ఎస్ఐ అశోక్‌బాబు గురువారం దర్యాప్తు చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రుల ఫోన్లలో సంప్రదించారు. రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ చేసి తాము హైదరాబాద్‌కు వెళ్తున్నామని, అక్కడే చదువుకుంటామని, తమ కోసం వెతకవద్దని వివరించినట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు తెలిపారని అన్నారు. వారు చేసిన ఫోన్ నంబరును ప్రిన్సిపాల్ గాయత్రి సంప్రదించిగా విద్యార్థినులు కాజీపేటలో దిగిపోయారని అవతల వ్యక్తి చెప్పారని అన్నారు. కాగా, గురువారం చైల్డ్‌లైన్ అధికారి నీరజ పాఠశాలలో విచారణ చేపట్టారు.

సోంపేట : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తూరు : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

సోంపేట: మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలను ఖండిస్తూ, అక్కడ శాంతి నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని జైభీమ్ సేన, యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి సోంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించి నియంత్రించాలన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో లండ బాబూరావు, నగిరి మోహనరావు, మద్రిపాటి పూర్ణచంద్రుడు, హేమచంద్రరావు, డి.గోవింద్, రాజేష్, వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై హత్య, అత్యాచార ఘటనలకు నిరసనగా మన్యం బంద్‌కు మద్దతుగా మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న ఆధ్వర్యాన గిరిజనులు ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర సిఎం బీరేంద్రసింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో. సవర చిలకమ్మ, ముసలమ్మ, అప్పలమ్మ, సమలమ్మ, నీవేణి, లక్ష్మి, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

మందకొడిగా ఓటరు నమోదు సర్వే

ప్రజాశక్తి - టెక్కలి

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల 21 నుంచి మండలంలో ఇంటింటా ఓటరు నమోదు సర్వే మందకొడిగా సాగుతుంది. ఈ నెల 20లోగా నమోదు సర్వే పూర్తవుతుంది. ఇంతవరకు సర్వే ముందుకు సాగకపోవడంతో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ఓటర్ల జాబితా తప్పులు, తడకలుగా ఉండడం, కొందరి ఓట్లు గల్లంతుకావడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఇంటింటా ఓట్లు సర్వే అనుకూలిస్తుందని అందరూ ఆశించారు. తరచూ యాప్ మొరాయిస్తుండడంతో ఇప్పటి వరకు 10 శాతం కూడా సర్వే పూర్తికాకపోవడంతో ఒకింత ఆందోళనగా చెందుతున్నారు. మండలంలోని 27 పంచాయతీలకు 76 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 31,649 కుటుంబాలకు, 61,973 మంది ఓటర్లు ఉన్నారు. 76 మంది బిఎల్ఒలుగా రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం ప్రభుత్వం నియమించింది. ఏదైమేనా మండలంలో ఇంటింటా ఓటరు నమోదు సర్వే రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల్లో ఆందోళన కలిగిస్తుంది.

నేడు కింతలిలో స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని కింతలిలో శుక్రవారం నిర్వహిం చనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరుకానున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. ఈ సందర్భంగా కింతలిలో సచివాలయం సిబ్బందితో, వాలంటీర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబందించిన పూర్తి సమాచారంతో సిబ్బంది, వాలంటీర్లు హాజరుకావాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - కవిటి

కూలేందుకు సిద్ధంగా ఉన్న రావిచెట్టు

మండలంలోని చిన్నజల్లుపుట్టుగ నుంచి డి.జి.పుట్టుగ వెళ్లే రోడ్డు ఉన్న మోడువారిన రావిచెట్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు, బాటసారులు, రైతులు, కూలీలు ఆ రావిచెట్టుతో ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆ చెట్టు కిందనుంచే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం అటుగా వెళ్లే స్థానికులు ఆ చెట్టు కింద నుంచి భయం భయంగా ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా ఆ చెట్టు కింద నుంచే హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉండడంపై కూడా స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదం సంభవించకుండానే అధికారులు స్పందించి చెట్టు తొలగించాలని కోరుతున్నారు.

పోర్టు పరిహారం చెల్లించాలంటే లంచం అడిగారు

మూలపేట మాజీ సర్పంచ్ భీమారావు

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ భీమారావు

నౌపడ: సంతబొమ్మాళి మండలం గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించమని అడిగితే తహశీల్దార్ చలమయ్య లంచం డిమాండ్ చేశారని మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు ఆరోపించారు. రెండో రోజు బుల్డోజర్ల సాయంతో పంటను ధ్వంసం చేస్తున్న సందర్భంగా గ్రామస్తులతో కలిసి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం గురువారం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఒక్క రూపాయి పరిహారం చెల్లించకుండా తమ పొలాలను ధ్వంసం చేస్తున్నారని, ఇది ఎక్కడ న్యాయమని ప్రశ్నించారు. ఏమైనా ఉంటే కలెక్టర్ వద్దకు వెళ్లి అడగాలని తహశీల్దార్ బాధితారాహిత్యంగా చెబుతున్నారని విమర్శించారు. తహశీల్దార్ ఆదేశాలతోనే రెవెన్యూ అధికారులు భూములు ఉన్న వాళ్లకు లేనట్లు, లేని వాళ్లకు ఉన్నట్లు తప్పుడు సమాచారం నమోదు చేశారని అన్నారు. తాము ఆరుగురు సోదరులమని, తమకి 11 ఎకరాల 48 సెంట్లు భూములు పడితే... దీనిలో 11 ఎకరాల రెండు సెంట్లు మాత్రమే అవారులు రాశారని చెప్పారు. దీనిపై సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మిగతా 46 సెంట్లు నమోదు చేసి పరిహారం చెల్లించాలని తహశీల్దార్‌కు ఆదేశించారని అన్నారు. అయితే అవార్డులు పాస్ చేయాలంటే తహశీల్దార్ లంచం అడిగారని, అందుకే తమ భూములు ఇవ్వలేదని అన్నారు. దీంతో తమపై కక్ష సాధింపు చర్యలకు దిగారని విమర్శించారు.

పిఎసిఎస్ చైర్మన్లు బాధ్యతల స్వీకరణ

పొందూరు: పొందూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కొంచాడ రమణమూర్తి గురువారం పగ్గాలు చేపట్టారు. ఈయనకు మరలా తిరిగి ఆరు నెలలు పాటు పొడిగిస్తూ ప్రభుత్వం జిఒను జారీ చేసింది. ఈయనతో పాటు పాలకవర్గ సభ్యులుగా బొమ్మాళి శేషగిరిరావు, గూనాన కృష్ణలను నియమించారు. గత పాలకవర్గం పదవీ కాలం జులై 31తో ముగియగా, మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరలా తమపై నమ్మకంతో పగ్గాలు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన పాలకవర్గానికి సిఇఒ ఎర్నేన పాపినాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్‌బాడాన సునీల్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

పొందూరు : పత్రాన్ని అందుకుంటున్న రమణమూర్తి

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా దువ్వాడ మధుకేశవరావును కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పిఎసిఎస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గం ఆరు నెలల కాల పరిమితితో నియమిస్తూ వస్తుంది. మళ్లీ పిఎసిఎస్ చైర్మన్‌గా ఎంపికకు కృషి చేసిన మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

బూరగాం సచివాలయం ప్రారంభం

కంచిలి : ప్రారంభిస్తున్న విజయ

ప్రజాశక్తి కంచిలి

మండలంలోని బూరగాంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం సాధించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్, జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు రామ్‌దాసు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు చర్యలు

సోంపేట : బారువ-కంచిలి రహదారి నుంచి పలాసపురం మీదుగా జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు మరమ్మతులకు గురైందని, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి రహదారిని గురువారం పరిశీలించారు. ఆమెతోపాటు సర్పంచ్ తడక జోగారావు, గ్రామస్తులు పీరియా అప్పలస్వామి, బెందాళం వెంకటేష్, బి.మదన్‌మోహన్, బి.కృష్ణారావు, రామారావు ఉన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణాలు

ప్రహరీ నిర్మించిన ఆక్రమణదారుడు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో భూ కబ్జాలకు నిలయంగా మారింది. అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నాయకులు అండదండలతో చెరువులు, కాలువలు, చివరకు శ్మశానాలు ఆక్రమించుకోవడం పరిపాటిగా మారింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని న్యూకాలనీ సమీపంలో దేవర చెరువు ఇప్పటికే ఆక్రమణలకు గురైంది. మిగిలిన చెరువు గర్భాలను ఆక్రమించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పలాసకు చెందిన జీడిపప్పు వ్యాపారి కొన్నాళ్ల క్రితం చెరువు గర్భం సర్వే నంబరు 68లో 16 మూరలు ఇంటి స్థలాన్ని కొంత మంది వద్ద కొనుగోలు చేశారు. ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు జీడి వ్యాపారి అధికార పార్టీకి చెందిన నాయకులను ఆశ్రయించారు. వారికి లక్షలాది రూపాయలు ముట్టజెప్పి ఖాళీగా ఉన్న ఆ స్థలంపై ఇటీవల ప్రహరీ నిర్మించారు. ఈ నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేవని సమాచారం. అయితే గతంలో దేవర చెరువు గట్టును, ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకొని నివశిస్తున్న 13 మందికి ఇటీవల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇంటి స్థలం కూడా చెరువు గర్భంలో ఉండడం విశేషం. ఈ విషయమై తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును వివరణ కోరగా, నిర్మాణ పనులను నిలుపుదల చేయిస్తామని తెలిపారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు వివరణ కోరగా, చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటికి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు.

నివురుగప్పిన నిప్పలా గ్రూపుల పోరు

ఆమదాలవలస : నియోజకవర్గంలోని గ్రూపుల పోరు నివురు గప్పిన నిప్పులా ఉంది. దీంతో వైసిపి పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. గడచిన ఎన్నికల్లో అందరం సమిష్టిగా పనిచేసే నియోజకవర్గంలో తిరుగులేని మెజార్టీతో అభ్యర్థిని గెలిపించకోగలిగామని, ఇప్పుడు అటువంటి పరిస్థితి కనుచూపుమేర కనపడడం లేదని ఆ పార్టీ సీనియర్ నాయకులే వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతుంది. పట్టణంలో బుధవారం జరిగిన రెండు అనుయాయుల మధ్య ఘర్షణ జరగడంతో మరో గ్రూపు సంబరాలు చేసుకొని ఆనందపడ్డారు. అది తాత్కాలికమైనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒక గ్రూపుకు సజ్జల, మరో గ్రూపుకు విజయసాయిరెడ్డి అండదండలు ఉన్నాయని చర్చ సాగుతుంది. గురువారం కూడా వైసిపి కార్యాలయాల వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుంది. దీంతో భారీ ఎత్తున పోలీసులు మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

కర్రలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అవగాహన కల్పించాలని వినతి

ఇచ్ఛాపురం : ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. ఈ మేరకు ఎన్నికల డిటి శ్రీహరిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా ఓటర్ల నమోదులో ప్రధాన బాధ్యత వహిస్తున్న బిఎల్ఒల ఎవరూ కూడా సక్రమంగా సర్వే నిర్వహించడం లేదని అన్నారు. వాలంటీర్లు సచివాలయానికి వెళ్లి ఓటరు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారని డిటి దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన 20 రోజుల్లో ఓటరు నమోదు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. శేఖర్, భాస్కర్, గౌడ్, ఉపేంద్ర, ఢిల్లీ, అజిత్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - పలాస

రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఒడిశా రాష్ట్రం భీంపురానికి చెందిన సవర జునాష్ (23) గురువారం సాయంత్రం మండలంలోని కాంట్రాగడ వద్ద ట్రాక్టర్‌తో పాటు యువకుడు గెడ్డలో పడి మృతి చెందారు. స్థానికులు, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రెంటికోటకు చెందిన షణ్ముఖరావు వద్ద ఒడిశా రాష్ట్రం భీంపురానికి చెందిన సవర అబ్రహం ట్రాక్టర్ డ్రైవర్‌గా, అదే గ్రామానికి చెందిన సవర జునాష్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రెంటికోటకు చెందిన పారిగ అప్పన్న వ్యవసాయ పొలం కాంట్రాగడలో ఉంది. ట్రాక్టర్‌తో దమ్ము పెట్టి రోడ్డుకు అవతలి వైపు వేరే పొలానికి దమ్ము పెట్టేందుకు వెళ్తున్నారు. అక్కసారిగా ట్రాక్టర్ అదుపు తప్పి గెడ్డలో పడిపోయింది. దీనిని ముందుగా గమనించిన డ్రైవర్ అబ్రహం ట్రాక్టర్ పైనుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న సవర జునాష్‌పై ట్రాక్టర్ పడిపోవడంతో అక్కడక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి తండ్రి సవర ఫైండా, అన్నయ్య, అక్క, చెల్లెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుడు కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎఎస్ఐ గణపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారి మృతి

భవ్యశ్రీ

సోంపేట : మండలంలోని బట్టిగల్లూరు పిహెచ్‌సిలో రెండో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న మెడిశెట్టి భవ్యశ్రీ (25) గురువారం విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. బట్టిగల్లూరు పిహెచ్‌సిలో వైద్యురాలిగా పనిచేస్తున్న భవ్యశ్రీ విధి నిర్వహణలో భాగంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసేందుకు విశాఖపట్నం వెళ్లారు. అక్కడ తన వదినతో కలిసి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా... వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె స్వగ్రామం యానం. మృతురాలి తండ్రి యానంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి, కాగా, ఆమె అక్క మూడేళ్ల క్రితం డెంగీ వ్యాధితో మృతి చెందింది. ప్రస్తుతం భవ్యశ్రీ హరిపురంలో నివాసం ఉంటూ బట్టికల్లూరులో పిహెచ్‌సిలో విధులు నిర్వహించేంది. వైద్యులు భవ్యశ్రీ మృతితో బట్టిగల్లూరు వైద్యాధికారి హరిచరణ్, సిబ్బంది తమ సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి...

టెక్కలి రూరల్: మండలంలో పెద్దరోకళ్ళపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దరోకళ్లపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వివరాలు లభ్యం కాలేదు. ఘటనపై పలాస జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

ఓటరు సర్వేను పరిశీలించాలి

పలాస : ఓటరు నమోదు సర్వేను కార్యకర్తలు, నాయకులు పరిశీలించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వజ్రపుకొత్తూరు, పలాస మండల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ఓట్లు తియ్యడమే లక్ష్యంగా వైసిపి పనిచేస్తుందని, అందుకు సర్వేను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. బూత్ స్థాయిలో సమస్యలను పార్టీ కార్యాలయానికి తెలియజేయాలని, వాటిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, సురాడ మోహనరావు, దువ్వాడ సంతోష్, అవుగాన దశరథుడు పాల్గొన్నారు.

అచ్చెన్న వాస్తవాలు తెలుసుకోవాలి

టెక్కలి రూరల్ : ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రైతు బెండి రామస్వామి ఒక ప్రకటనలో కోరారు. టెక్కలి తెంబూరు ఎన్‌హెచ్-5 దరి సర్వే నంబరు 489/1ఎ 14 ఎకరాలు భూమిని 1980లో కొనుగోలు చేశామని అన్నారు. ఎన్‌హెచ్-5 నిర్మాణానికి 50 సెంట్లు పొలం భూమిని కేంద్ర ప్రభుత్వం తీసుకుని నష్టపరిహారం చెల్లించదని తెలిపారు. 43 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 9 సెంట్లు భూమి జిరాయి అని అన్నారు. దీనికి సంబంధించిన పాస్ పుస్తకం కూడా ఉందని అన్నారు. ఇప్పటికే కొంతమంది ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారని అన్నారు. తయనతో పాటు రైతులు చింతాడ పార్వతీశం, చింతాడ జోగారావు, దవళ రమేష్ కుమార్, దేవుని నారాయణరావు, వై పద్మావతి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పోలాకి: సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రత్యేక సలహారులు ముద్దాడ భైరాగినాయుడు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని రకాల ధ్రువపత్రాలను ప్రజలకు అందజేశామని అన్నారు. సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే లబ్ధిదారులకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. జెసిఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు చేరువ అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉషశ్రీ, డిటి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి కె.తాతారావు, మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, కణితి సత్తిబాబు, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డును అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ట్రాన్స్‌జెండర్‌కు రేషన్‌కార్డు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పెదరెల్లి వీధిలో నివాస ముంటున్న ట్రాన్స్‌జెండరు గురుమూర్తి అలియాస్ రేణుక తన రేషన్ కార్డులో జెండర్ పురుషుడని ఉందని, ట్రాన్స్‌జెండర్‌గా మార్పు చేయాలని సచివాలయం సిబ్బందిని కోరారు. సాంకేతిక కారణాల వల్ల ఇది మార్పు సాధ్యం కాదని సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె తనకు న్యాయం చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు 2022 అక్టోబరులో ఫిర్యాదు చేసింది. రేషన్ కార్డులో ఆ రకమైన లింగ మార్పిడి జరిగితే తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సౌకర్యాలు వస్తాయని, ప్రస్తుతం కార్డు ఉన్నా ప్రయోజనం లేదని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె అభ్యర్థన మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సదరు సచివాలయం సిబ్బందికి నోటీసు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో చర్చించి తర్వాత సచివాలయ సిబ్బంది గురువారం ఆమెకు ట్రాన్స్ జెండారుగా మార్చి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సమక్షంలో కార్డును అందజేశారు.

డాక్టరేట్‌ను అందుకుంటున్న ధనుంజయ్

సినీ గాయకుడు ధనుంజయ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి– ఆమదాలవలస

మండలంలోని బెలమాంకు చెందిన సినీ గాయకుడు సీపాన ధనుంజయ్‌కు ఆంధ్రా విశ్వవిద్యాలయం సంగీత విభాగం నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. సంగీత విభాగం ఆచార్యులు సరస్వతీ విద్యార్థి పర్యవేక్షణలో 1960–20 మధ్య కాలంలో సినీ సంగీతంలో వీణ, వయోలిన్, వేణువు, వినియోగం – అధ్యయనం అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ లభించింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ పట్టాను ఆయన అందుకున్నారు. సినీ గాయకుడు సీపాన ధనుంజయ్ లౌక్యం, గోపాల గోపాల, టెంపర్ తదితర సుమారు 85 సినిమాల్లో పాటలను పాడారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. బెలమాం గ్రామ సర్పంచ్ కణుగుల కిషోర్‌బాబు, గ్రామస్తులు ధనుంజయకు డాక్టరేట్ రావడం అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ గణపతి

పారదర్శకంగా ఓటరు సర్వే

ఆమదాలవలస: బిఎల్‌ఒలు పారదర్శకంగా విధులు నిర్వహించాలని తహశీల్దార్ ఎన్.గణపతి అన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభించిన ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల బిఎల్‌ఎలకు ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటింటా సర్వే చేసినప్పుడు గ్రామ వార్డు వాలంటీర్లను భాగస్వాములను చేయొద్దని ఆదేశించారు. ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే చోటుకు వచ్చే విధంగా సంబంధిత ఫారంలో దరఖాస్తు చేయాలని సూచించారు. మృతి చెందిన వ్యక్తుల ఓట్లను, అలాగే శాశ్వతంగా వేరే ప్రాంతానికి వలస వెళ్లిన వారి ఓట్లను ఫారం–7ను దరఖాస్తు చేసి తొలగించాలని తెలిపారు. ఇంటింటా సర్వేలో వెనకబడిన బిఎల్‌ఒలను మందలించారు. వచ్చేవారం నాటికి పురోగతిని పెంచకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళీధర్ నాయక్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి– ఆమదాలవలస

సరుకులను అందజేస్తున్న తేజలక్ష్మి

గార మండలంలోని బందరువానిపేటలో ఇటీవల పడవ ప్రమాదంలో మృతి చెందిన మూడు మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ పి.తేజలక్ష్మి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బందరువానిపేట సర్పంచ్ గనగల రామారావు మాట్లాడుతూ పడవ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు ఎటువంటి జీవనాధారం లేదని, సముద్రంలో వేటే వాళ్ల ప్రధాన వృత్తి అని అన్నారు. ప్రభుత్వానికి ధీటుగా ఇటువంటి కార్యక్రమాలను రోటరీ క్లబ్ చేపట్టడం శుభ సూచకమని కొనియాడారు. మెరైన్ కో–ఆపరేటివ్ ప్రెసిడెంట్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ రోటరీ క్లబ్ తరఫున వేటకు వెళ్లే మత్స్యకారులకు వేట దుస్తులను అందజేసి ప్రాణాలను కాపాడాలని, అది ఒక్క రోటరీ క్లబ్‌కే సాధ్యమని అన్నారు. అనంతరం తేజలక్ష్మి పడవ ప్రమాదానికి గురై మృతి చెందిన స్థలాన్ని పరిశీలించారు. వాలంటీర్లు హేమంత్, వినయ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా శంకరరావు

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్‌గా పైల శంకర్రావును నియమిస్తూ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రాజమహేంద్రవరం వారు ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన కుమారస్వామి వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లిన కారణంగా ఏర్పడిన ఖాళీలో పైల శంకర్రావుకు పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపల్ గా నియమించారు. ఈయన ఇంతకు పూర్వం వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గానూ, స్థానిక బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గానూ బాధ్యతలు నిర్వహించారు.. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణిజ్యశాస్త్రం అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు.

గడప గడపకూ తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి– సరుబుజ్జిలి

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని గడపగడపకూ తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని డకరవలస పంచాయతీ పరిధిలోని సుభద్రాపురం, సూర్యనారాయణపురం గ్రామాల్లో రూ.65 లక్షలు, కొత్తకోట పంచాయతీ పరిధిలోని నక్కలపేటలో రూ.48 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ద్వారా నీరు అందించే కార్యక్రమానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ తన పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను చూసి గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా తాగునీటిని అందిస్తున్నారని అన్నారు. ముందుగా సూర్యనారాయణపురంలో సమగ్ర భూ సర్వే చేసిన పంట పొలాల రైతులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.వి.జి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్,చ బిసిసెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ సురవరపు తిరుపతి పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

ఆమదాలవలస : సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని శాసనసభ స్పీకర్ సీతారాం అన్నారు. మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని పొన్నాంపేట, పొన్నాంపేట కాలనీ, చెవ్వాకులపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన లబ్ధిని వివరించారు. అవినీతి లేని పారదర్శక పాలనను ప్రజలకు అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఎంపిటిసి ప్రతినిధి దామోదర్ నాయుడు, సర్పంచ్ ప్రతినిధి చల్లా సింహాచలం, గురుగుబెల్లి చలపతిరావు, చల్లా కామేశ్వరరావు, తమ్మినేని వేణు పాల్గొన్నారు.

ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం

'మహాశక్తి'తో మహిళల అభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవి

అవగాహన కల్పిస్తున్న కూన రవికుమార్

పొందూరు: టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మహాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మలకాంలో గురువారం టిడిపి మహాశక్తి పథకం పై ఇంటింటికీ వెళ్లి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలకు ఎంతగానో అన్యాయం జరుగుతుందని, వారిపై రోజూ ఎక్కడో ఒక దగ్గర అఘాయిత్యాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని అన్నారు. టిడిపి హయంలోనే మహిళల అభివృద్ధికి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మహిళలకు నీటి కష్టాలను తీర్చేందుకు టిడిపి ప్రభుత్వం హయంలో జలజీవన్ మిషన్ పథకానికి రూ.235 కోట్లు మంజూరు చేస్తే... శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కమీషన్ల కోసం కేవలం రూ.169 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి కూన ప్రమీల, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంపిటిసిలు బాడాన హారిక, ఎ.వాణి, తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజా త, పొందూరు మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి నాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్‌ఎల్ కో–ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. రూపే, ఎటిఎం కార్డుల వద్ద ప్రయోజనాలను తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్స్యూరెన్స్ పథకాలను గురించి విపులంగా ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సిఎఫ్ గాయత్రి, ఎఎన్‌ఎం ధనలక్ష్మి, ఆర్.సుకన్య, ఆశా వర్కర్ కళావతి, రోహిణి, సిఎఫ్‌ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

8న పలాస మండల సమావేశం

పలాస : పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన ఈ నెల 8న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలన్నారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

17న మహాజన సభ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభను ఈ నెల 17న జిల్లా సహకార అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అర్బన్ క్రెడిట్ బ్యాంకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు హాజరు కావాలని కోరారు. అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని అర్బన్ క్రెడిట్ బ్యాంకులో విలీన ప్రక్రియలో భాగంగా ఈ మహాసభలో పలు అంశాలను చర్చించనున్నట్లు తెలిపారు.

పామాయిల్ సాగుపై అవగాహన

బూర్జ: పామ్ అయిల్ సాగుతో అధిక లాభాలను ఆశించవచ్చునని, ప్రతి రైతూ పామ్ ఆయిల్ సాగు చేసేందుకు ముందుకు రావాలని టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కె.గోవిందరావు అన్నారు. మండలంలోని కాఖండ్యారో హార్టికల్చర్ ఆధ్వర్యాన పామ్ ఆయిల్ సాగుపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం పామ్ ఆయిల్ సాగు మంచి లాభాలు కనబరుస్తున్నాయని తెలిపారు. పామ్ ఆయిల్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాసరావు, మండల ఆర్టికల్చర్ హయాతి, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపిప్రతినిధి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మందస : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మందస జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు అనిల్ సాల్మన్‌రాజు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ అన్నారు. ఈ మేరకు పాఠశాలల ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. మానవాళికి మొక్కలు అవసరం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ ప్రధాన కార్యదర్శి బి.తిరుమల, రామకృష్ణ, సతీష్, శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది ఎస్.అప్పారావు, ఎన్.కరుణాకర్, ఎస్.నారాయణరావు, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన హెచ్‌ఎం విశ్వనాథం మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ గణేష్, సైన్స్ ఉపాధ్యాయులు కూర్మారావు, ప్రెస్ క్లబ్ సలహాదారు మురళీపండా, గౌరవ అధ్యక్షులు పొట్నూరు శంకర్, అధ్యక్షులు పల్లంటి చిరంజీవి, కార్యదర్శి పాలెపు దివాకర్, ఉపాధ్యక్షులు బొండాడ శంకర్, కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ, పిలక కృష్ణవేణి, తేజ, శ్రీను, మాధవ్, నిఖిల్, చౌదరి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మొక్కను నాటుతున్న హెచ్‌ఎం విశ్వనాథం

బూర్జ : మండలంలోని పాలవలస పంచాయతీ మర్రిపాడులో సత్యసాయి జయంతిని సందర్భంగా ఎంపిపి కర్నేన దీప మొక్కలను నాటారు.

నందిగాం : నందిగాం శ్మశాన వాటికలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి మొక్కలను నాటారు. అనంతరం దాత దాసరి వైకుంఠరావు తండ్రి సోమేశ్వరరావు జ్ఞాపకార్థం ఆరు సిమెంట్ బెంచీలను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జె.జయరాం, ఎంపిటిసి ప్రతినిధి ఎ.విష్ణు, ఇ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

పొందూరు : సరుకులను ప్రదర్శిస్తున్న సిబ్బంది

తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

పొందూరు: మండలంలోని రాపాక అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, బాలింతలకు, గర్భిణులకు తల్లిపాలు ప్రాధాన్యతను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌డిడిసిపి ప్రోగ్రాం జోనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు పద్మ, రమణమ్మ, వాణిశ్రీ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల పౌష్టికాహార కిట్లను మలగాం సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్ కార్యకర్తకు అందజేవారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కంది లచ్చయ్య, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని పలాసపురం అంగన్వాడీ కేంద్రంలో జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావుల సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని టిడిపి కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో తల్లి పాలు వారోత్సవాలు సందర్భంగా వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ రేషన్ సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యకరమైన పోషకాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోమలి, సుమిత్ర,హేమలత పాల్గొన్నారు.

'లైన్ షోయింగ్'లో ఉబాలు

ప్రజాశక్తి– రణస్థలం

మండలంలోని ముక్తుంపురంలో పోతురాజు ఈశ్వరరావు పొలంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరి లైన్ షోయింగ్ పద్ధతిలో ఉబాలు వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఎస్‌డిఎ రాంబాబు మాట్లాడుతూ వరి లైన్ షోయింగ్ చేయడంతో చీడపీడల నుంచి రక్షణ కలుగుతుందని అన్నారు. గాలి, వెలుతురు తగిలి పిలకల పరిమాణం పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చునని పేర్కొన్నారు. వరి లైన్ పద్ధతులు వేస్తే ప్రకృతి యాజమాన్య పద్ధతులు పాటించడానికి అనువుగా ఉంటుందని అన్నారు. దుబ్బులు పెద్దగా, వేపుగా పెరిగి రైతులకు అధిక దిగుబడును తీసుకోవడానికి వీలుగా ఉంటుందని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం కూడా తగ్గుతుందని అన్నారు. కనుక లైన్ షోయింగ్ చేయడంలో నీటి, పురుగులు యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చు అన్నారు. శత్రు పురుగులు, తెగులు నుంచి ఈ లైన్ షోయింగ్ చేయడంతో బెడద నుంచి తగ్గించుకోవచ్చునని సూచించారు. వరి లైన్ షోయింగ్ చేయడం మంచి పద్ధతిగా సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సన్యాసిరావు, వెంకటరమణ, సత్యవతి, జ్యోతి, రాజు, సూర్యకాంతం, సునీత, అంజలి, సత్యనారాయణ పాల్గొన్నారు.

'లైన్ షోయింగ్' పద్ధతిలో ఉబాలు వేస్తున్న కూలీలు

ఆముదాలవలస : మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులతో చాలా ఉత్సాహంతో లైన్ షోయింగ్ విధానంలో వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ చేపేనపేటలో ఒకే దగ్గర యాభై ఎకరాల విస్తీర్ణంలో లైన్ షోయింగ్ పద్ధతి చేయించామని అన్నారు. దాదాపుగా వరి సాగయ్యే విస్తీర్ణం చాలావరకు లైన్ షోయింగ్ పద్ధతిలోనే చేస్తున్నామని తెలిపారు. రైతులు వరుస క్రమంలో నాట్లు వేసుకునే విధానాన్ని చూసి చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఈ లైన్ షోయింగ్ విధానం వల్ల మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు.

మాట్లాడుతున్న వాణి

అభివృద్ధిపై చర్చకు అచ్చెన్న సిద్ధమా?

ప్రజాశక్తి– టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సిద్ధమేనా అంటు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి సవాల్ విసిరారు. తన స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల అధికారంలో ఉండి.. అవకాశం ఉన్నా ఏమీ చేయని టిడిపి, ప్రజా ధనం ప్రభుత్వం వృథా చేసిందని అన్నారు. ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యంతో సిఎం జగన్ ముందుకు సాగుతున్నారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలన్న ఆలోచనతో ప్రారంభమైందే జగనన్న సురక్ష పథకం అని అన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది వరకు అంతా కలిసి పని చేశారని అన్నారు. టెక్కలిలో భూ దందాలు జరిగాయని ఆరోపించడం తగదన్నారు. టిడిపి హయాంలోనే భూ దందాలు జరిగాయని, ఇప్పుడు అలాంటివేమి లేవని, ఉంటే అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈమెతో పాటు ఎంపిపి అట్లా సరోజనమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఈ నెల 4న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రోడ్డు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, తీగలు మార్పు చేస్తున్నామని అన్నారు. ఉదయం 10నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాగోలు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త రోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస : టమాటాలను పంపిణీ చేస్తున్న సతీష్

రాయితీపై టమాటాల విక్రయం

పలాస : పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన గురువారం ప్రభుత్వం అందిస్తున్న రాయితీపై రూ.50లకు ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్ టమాటాలను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయానికి సుమారు వెయ్యి కేజీల టమాటాలు వచ్చాయని, ప్రతిఒక్కరికీ కేజీ చొప్పున పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి కార్యదర్శి పద్మ, దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక రైతు బజారులో సబ్సిడీపై ప్రజలకు టమోటాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పంపిణీ చేశారు. ఆధార్, రేషన్ కార్డులను తీసుకొని రైతు భరోసా కేంద్రానికి వచ్చి రూ.50లు చెల్లించి కిలో టమాటాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్‌లు గురువెల్లి కేశవరావు, నూక సత్యరాజు, నేతింటి అప్పలస్వామి, బోనెల ఎల్లయ్య, రైతు బజారు ఇఒ నారాయణరావు, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడాలి

ప్రజాశక్తి – సీతంపేట

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపడాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశ నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని స్ప్రేయింగ్, ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. క్లోరిక్యులేషన్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన పంచాయతీ కార్యాలయాల్లో బ్లీచింగ్ నిల్వలు ఉంచాలని చెప్పారు. గ్రామ వాలంటీర్ల ద్వారా సమాచారం తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. గడప గడప వచ్చిన వినతులు, కాపు నేస్తం మిగతా సంక్షేమ పథకాలు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి – పాలకొండ రూరల్

ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సబ్ జైలులో రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సబ్ జైలు అధికారి బి.కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ఆరా తీశారు. అలాగే వారికి అందిస్తున్న మెనూను పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రిమాండ్ ఖైదీలు ఉంటున్న గదులు శుభ్రత పాటించాలని అన్నారు. ముఖ్యంగా మరుగు దొడ్లు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు ఆదేశించారు. ఖైదీలకు కాచి చల్లార్చి నీటిని తాగాలని అన్నారు. అలాగే ముఖ్యంగా ఐ ఇన్ఫెక్షన్ చాలా ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను, గేటు రికార్డులు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌సి పి.చంద్ర రావు, పి.మధు, హేమసుందర్, ఎస్.శ్రీనివాసరావు తదితర సిబ్బంది ఉన్నారు.